# త్రివిధ దళాలకు సంపూర్ణ మద్దతు

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

హుస్నాబాద్ టౌన్, మే 8: ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు నిర్వహించిన దేశ త్రివిధ దళాలకు బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా గురువారం హుస్నాబాద్ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ తర్వాత కూడా పాకిస్థాన్ పశ్చాతాప పడకుండా కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడం తగదన్నారు. ఉగ్రవాదం, టెర్రరిస్టులపై దాడుల విషయంలో కేంద్రానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. సరిహద్దుల్లో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, సున్నితమైన అంశాన్ని దుష్ప్రచారం చేసే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు ఆందోళన చెందవద్దని, కంటోన్మెంట్ ఏరియాల్లో సైనికులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనుమానితులు, ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ఆశ్వీరాదంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషిచేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య పాల్గొన్నారు.

**రాజేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి**

హుస్నాబాద్ రూరల్, మే 8: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. మంత్రి తన పుట్టినరోజును పురస్కరించుకొని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కోర్టు బ్రేక్


ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను అపాలనే కోర్టు ఉత్తర్వులను చూపిస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి, మే 8: మండలంలోని గుగ్గిళ్ల, తిమ్మాయ్యపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌వేస్ బయోఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వెంటనే నిలిపి వేయాలని జిల్లా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీని రద్దు చేయాలని, నిర్మాణ పనులను నిలిపివేయాలని, ఇథనాల్-కార్బన్‌డైఆక్సైడ్ ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. జడ్జి ఇరువురి వాదనలు విని నిర్మాణ పనులు నిలివేయాలని, ఉత్పత్తులను చేయరాదని ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. కోర్టు తీర్పుపై సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణంతో వ్యర్థ జలాలు, దుర్వాసన రావడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచే వచ్చే కూలీలతో ఇబ్బందుల ఎదురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి


హరితసేన ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న నాయకులు

జగదేవపూర్, మే 8: రాజ్యసభ ఎంపీ సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా హరితసేన కార్యక్రమం ద్వారా మండలంలో పుట్టినరోజు, పెండ్లిరోజు వేడుకలను పురస్కరించుకొని ముమ్మరంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు హరితసేన గజ్వేల్ ఇన్‌చార్జి అనిల్ మొగిలి తెలిపారు. గురువారం జగదేవపూర్‌కు చెందిన భీమ రిసాత్విక మహేశ్‌ల కూతురు లిక్షిత పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో అలిరాజ్‌పే ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, జగదేవపూర్ హరితసేన ఇన్‌చార్జి లోకేశ్‌రెడ్డి, భీమరి రాజు, రవి పాల్గొన్నారు.

# పేదింటి వధువుకు పుస్తెమట్టెల అందజేత


పుస్తెమట్టెలను అందజేస్తున్న రాజుయాదవ్

మద్దూరు(ధూళిమిట్ట), మే 8: ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ జూరాల తండాకు చెందిన పాడి రైతు గుగులోతు బాలు కూతురు రితిక వివాహానికి కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పాల కేంద్రం అధ్యక్షుడు అల్లం రాజుయాదవ్ చేతుల మీదుగా పుస్తెమట్టెలను అందజేశారు. కార్యక్రమంలో డెయిరీ కార్యదర్శి, శ్రీధర్, పాడి రైతులు పాల్గొన్నారు.


# జోరుగా పుచ్చకాయల విక్రయాలు



చేర్యాల మార్కెట్‌లో ఆటోలో, తోపుడు బండిపై విక్రయిస్తున్న పుచ్చకాయలు

చేర్యాల, మార్చి 8: ఎండాకాలంలో పుచ్చకాయలు తినడానికి అందరూ ఆసక్తి చూపుతుంటారు. వేసవి నుంచి ఉపశమనం పొందడానికి పుచ్చకాయ ఎంతగానో దోహదపడుతుంది. అంతేకాకుండా ఇందులో పుష్కలంగా ఔషధ గుణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. చేర్యాల పట్టణంలోని మార్కెట్, సినిమా టాకీస్, ఆర్టీసీ బస్‌స్టేషన్, మద్దూరు మండల కేంద్రం, కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో పలువురు వ్యాపారులు పుచ్చకాయలను ఆటోల్లో, తోపుడు బండ్లపై విక్రయిస్తున్నారు. దీంతో పాటు పలు గ్రామాల్లో వారాంతపు సంతల్లోనూ పుచ్చకాయలు విక్రయిస్తున్నారు. గతేడాది టన్ను పుచ్చకాయ రూ.6 వేలు ఉండగా, ఈ సీజన్‌లో రూ.6వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. చేర్యాల పట్టణంలో ఒక్కో పుచ్చకాయను కిలో రూ.30 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి మహారాష్ట్ర నుంచి వచ్చిన పుచ్చకాయలను పండ్ల వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు.

## ఆరోగ్యానికి మంచిది..



పుచ్చకాయలో బీ-విటమిన్, ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా ఉండడంతో శక్తితో పాటు నిస్తేజమైన శరీరానికి కొత్తశక్తి లభిస్తుంది. దీంట్లో 92 శాతం అల్కలైన్, నీళ్లతో పాటు పీచు పదార్థం ఉండడంతో శరీరానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇందులో ఉండే పీటా కెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి కూడా ఉపశమనం కలుగుతుంది. అస్తమా, మధుమేహం తదితర వాటి సమస్యలు పరిష్కరించడంతో పాటు పుచ్చ సక్రమంగా రక్త ప్రసరణ జరిగేలా పనిచేస్తుంది. గుండె కండరంలోని కణాలను కాపాడడంతో పుచ్చకాయలోని లైకోపిన్ పదార్థం బాగా ఉపయోగపడుతుంది. చర్మ సౌందర్యానికి ఉపయోగపడుతుంది.ఎండలో తిరగడంతో శరీరం కోల్పోయే నీటి శాతంతో పాటు లవణాలను పుచ్చకాయ తింటే రికవరీ అవుతాయి. మధుమేహంతో బాధపడేవారు పుచ్చను తినవచ్చు. సీజన్ల వారీగా లభించే పండ్లను తినడం వల్ల శరీరానికి అవసరమైన అన్ని విటమిన్లు, ప్రోటీన్లు అందుతాయి. – డాక్టర్ రఘునందన్‌రాణా, చేర్యాల

# సైనికుల క్షేమం కోరుతూ పూజలు


చిన్నకోడూరు: శేరిలింగంపల్లిలో ప్రత్యేక పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారులు


కోహెడ: ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు, మే 8: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో గురుస్వామి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ స్వాములు శేరిలింగంపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత ఆర్మీకి ఎలాంటి హాని జరగకుండా చూడాలని భగవంతుడిని వేడుకున్నారు. పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాలని, తీవ్రవాదాన్ని రూపుమాపాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్వాములు కోరారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై.. జైజవాన్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దయ్యాల పవన్, కనుగుల శ్రీనివాస్, మోహన్ నాగరాజు, రాకేశ్, పంతులు చంద్రారెడ్డి, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

**'ఆపరేషన్ సిందూర్' విజయంపై పూజలు**

కోహెడ, మే 8: భారత సైనికులు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మండల నాయకులు గురువారం స్థానిక హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైనికులకు మరిన్ని విజయాలు లభించాలని దేవుడిని వేడుకున్నారు. అనంతరం భారత్ మాతాకీ జై.. జై జవాన్ అంటూ నినాదాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పేర్యాల రాజేశ్వర్‌రావు, కొండబత్తిని సతీష్, నరాల శ్రీకాంత్, సతీష్, సుమన్, శివ, మహేశ్, వెంకటేశ్, శంకర్, అఖిల్, సత్యనారాయణరెడ్డి, పంతులు ప్రసాద్‌రావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

**సైనికుల సేవలు వెలకట్టలేనివి**

చేర్యాల, మే 8: పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి మట్టుబెట్టిన భారత సైనికులకు ఆంజనేయ స్వాములు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఆది ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం స్వాములు పూజల అనంతరం భారత సైనికులను అభినందిస్తూ జై భారత్.. జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ.. దేశ రక్షణలో సైనికులు సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

**నేడు సిద్దిపేటలో సంఘీభావ ర్యాలీ**

సిద్దిపేట టౌన్, మే 8: ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం హిందూ జాగృతి ఆధ్వర్యంలో సిద్దిపేట శివాజీ చౌక్ వద్ద సంఘీభావ ర్యాలీ ప్రారంభమవుతుందని పలు సేవాసంస్థల ప్రతినిధులు గంప శ్రీనివాస్, అయిత బాల్‌రాజేశం, అయిత రత్నాకర్, మంకాల నవీన్‌కుమార్, దాస శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి సిద్దిపేటలో వారు మాట్లాడుతూ.. శత్రు దేశంపై విరుచుకు పడుతున్న భారత త్రివిధ దళాలకు మనమందరం సంఘీభావం తెలపాలని, విపత్తు సమయంలో భారతీయులందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తామని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో వ్యాపార సంఘాల నేతలు పాల్గొన్నారు.


సైనికులకు సంఘీభావం తెలుపుతున్న ఆంజనేయ స్వాములు


సిద్దిపేట టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న హిందూ జాగృతి ప్రతినిధులు

# మహిళలు అప్రమత్తంగా ఉండాలి



బీడీ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

చేర్యాల, మే 8: ఏదైనా సంఘటన జరిగితే మహిళలు మౌనం వీడి పోలీసులకు తెలియజేయాలని హుస్నాబాద్ షీటీమ్ సభ్యులు కోరారు. మండలంలోని వేచరేణి గ్రామ దేశాయి బీడీ కంపెనీలో గురువారం మహిళా చట్టాలపై కార్మికులకు షీ టీమ్ బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా షీటీమ్ సభ్యులు మాట్లాడుతూ.. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని, వాట్సాప్‌కు వచ్చే ఎలాంటి లింక్‌లు ఓపెన్ చేయవద్దని, ఎవరైనా బ్యాంకు అధికారుమని మాట్లాడితే బ్యాంకు ఖాతా వివరాలు తెలుపవద్దన్నారు. అపరిచితుల మాటలు నమ్మవద్దని, సమస్యలు ఉంటే డయల్ 100 లేదా 8712667434 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కోర్సులు వినియోగించుకోవాలి




జగదేవపూర్, మే 8: జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్పొరేటుకు దీటుగా ఉత్తమ బోధన అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ బానోతు రాజన్న తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి మే 1వ తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో చేరాలని కోరారు. తమ కళాశాలలో ఈసారి రెండు కొత్త కోర్సులను ప్రవేశపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ ఈటీ ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈసారి కొత్తగా ఎంఈసీ, హెంపీహెచ్ డబ్ల్యూ రెండు కోర్సులను తెలుగు,ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

# వ్యవసాయాభివృద్ధికి యూబీఐ చేయూత


మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ శ్రీనివాస్

సిద్దిపేట/సిద్దిపేట టౌన్, మే 8: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని రీజినల్ హెడ్ బి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రాంతీయ కార్యాలయంలో డీఏవో రాధిక, నాబార్డ్ డీడీఎం నిఖిల్ రెడ్డి , ఎల్డీఎం బి.హరిబాబుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పథకాలు, నాబార్డు సబ్సిడీ వివరాలు, బ్యాంకు ఆఫర్ల గురించి వివరించారు. 65 యూనియన్ బ్యాంక్ శాఖలను కలిగి ఉన్న సిద్దిపేట ప్రాంతంలో ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి, వ్యవసాయ రంగానికి మద్దతు ఇవ్వడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం, ఏఐఎఫ్ పథకాల రుణాల గురించి వివరించారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


వైష్ణవిని అభినందిస్తున్న ఎంఈవో వరదరాజు, ఉపాధ్యాయులు

మద్దూరు(ధూళిమిట్ట), మే 8: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మద్దూరు ఎంఈవో వరదరాజు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 30 నుంచి ఈనెల 4వ తేదీ వరకు కర్ణాటకలో జరిగిన సబ్ జూనియర్స్ గర్ల్స్ జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న రేబర్తి హైస్కూల్ విద్యార్థిని చేవెళ్ల వైష్ణవిని గురువారం ఎంఈవో, ఉపాధ్యాయ బృందం అభినందించింది. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రభాను, చంద్రారెడ్డి, రవి, మల్లేశం, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రఫత్ తదితరులు పాల్గొన్నారు.

# బట్టీలు ఫుల్.. అనుమతులు నిల్!

- ప్రకృతి, ప్రజారోగ్యంపై ప్రభావం
- కాలుష్య కోరల్లో పల్లెలు

**ఇష్టారాజ్యంగా ఇటుకు బట్టీల నిర్వహణ.. నిబంధనలు పాటించని నిర్వాహకులు**


కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట గ్రామ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు

చేర్యాల, మే 8: ఏ చిన్న పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నా దానికి అనుమతులు తప్పనిసరి. అలాంటిది చిన్నతరహా పరిశ్రమగా పిలుచుకునే ఇటుకబట్టీల నిర్వహణకు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు.ఈ బట్టీల్లో ఉపయోగించే ముడిపదార్థాలతో ప్రకృతికి విఘాతం కలుగుతున్నది. ఇటుక బట్టీలు నిరంతరం కాలుష్యాన్ని వెదజల్లడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి నిర్వాహకులు గండికొడుతున్నారు. ఇటుకబట్టీలతో ప్రకృతికి హాని కలుగుతుందని బట్టీల నిర్వహణను నిబంధనల ప్రకారం పరిశ్రమల శాఖ అనుమతించదు. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో యథేచ్ఛగా ఇటుకబట్టీల నిర్వహణ కొనసాగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా తదితర జిల్లాలకు చెందిన వ్యాపారులు చేర్యాల, కొమురవెలి,మద్దూరు ఉమ్మడి మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి ఇటుకలు తయారు చేసి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో సమీపంలో బీటీ రోడ్డుకు పక్కనే ఉన్న రైతుల వ్యవసాయ భూముల్లో రెండు రకాలుగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు.లైట్ వెయిట్ ఇటుక, నెంబర్ ఇటుకల పేరిట బట్టీలు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు.ఎర్ర భూములున్న రైతులను కలిసి కొన్నేండ్ల పాటు కౌలు తీసుకుంటున్నారు. ఆ భూమిని మొదటగా చదును చేసి ఎర్రమన్ను తీసి ఇటుకలు తయారు చేస్తున్నారు. వ్యవసాయానికి సరఫరా చేస్తున్న ఉచిత కరెంటును ఇటుకల తయారీకి వినియోగించుకుంటున్నారు.

## గ్రామ సమీపంలోనే ఏర్పాటు

చేర్యాల పట్టణంలోని తూర్పుగుంటూరుపల్లెకు వెళ్లే రహదారి పక్కన పది ఎకరాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారు.కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట గ్రామ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఇటుకబట్టీ కొనసాగుతున్నది.దీనికి ఒకవైపు, పాఠశాల మరోవైపు నివాసిత ప్రాంతం ఉంది. లెనిన్‌నగర్ గ్రామంలో జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు.ఇక్కడ సైతం ప్రభుత్వ పాఠశాల, నివాసిత ప్రాంతాలకు సమీపంలో బట్టీలు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి సిద్దిపేట మీదుగా వచ్చే రహదారిలో సైతం బట్టీలు నిర్వహిస్తుండడంతో బట్టీలోంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళితో మల్లన్న భక్తులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నివాసిత, పాఠశాల ప్రాంతంలో బట్టీ ఉండడంతో దుమ్ము, ధూళితో ఆహార పదార్థాల పాడైపోతున్నాయి.కొందరికి ఆయాసం, దగ్గు వచ్చి ఊపిరికి కష్టంగా ఉంటున్నది. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.నీటి సౌకర్యం ఉన్న చోట, నీరు, విద్యుత్, బంకమట్టి, రహదారి సౌకర్యం ఇండే చోట నిర్వహణ సాగుతున్నది.

## అనుమతులు లేకుండానే...

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు ఉపయోగించేటప్పుడు తప్పనిసరిగా ల్యాండ్ కన్వర్షన్ తీసుకోవాలి. ఇటుక బట్టీల నిర్వహణ సీజనల్‌గా ఉంటుంది. దీనికి వన్‌టైం ల్యాండ్ కన్వర్షన్ తీసుకుంటే సరిపోతుంది. కానీ, ఇటుకబట్టీల నిర్వాహకులు ల్యాండ్ కన్వర్షన్ తీసుకోకుండానే బట్టీలను నిర్వహిస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్ తరువాత ఏ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్నారో ఆ పంచాయతీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. తీసుకున్న తర్వాత బట్టీల్లో తయారు చేసే ఇటుకల సామర్థ్యాన్ని బట్టి పన్నులు చెల్లించాలి. బట్టీల నిర్వాహకులు పంచాయతీ అనుమతి తీసుకోకపోగా పంచాయతీలకు ఎలాంటి పన్నులు చెల్లించడం లేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. బట్టీల్లో నీటి కోసం విద్యుత్ మోటర్లు వినియోగిస్తారు. రాత్రిపూట కూలీలు పనులు చేసేందుకు దీపాలను వెలిగిస్తారు. వీటికి విద్యుత్ అవసరం.అయితే బట్టీల యజమానులు విద్యుత్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే విద్యుత్‌ను ఆయా గ్రామాల్లో వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీశాఖ నియమ,నిబంధనల మేరకు సహజవనరుల రక్షణ, భూమి, నీటి వనరులను కాపాడడం, చెట్ల నరికివేతను అడ్డుకోవడం. కానీ, ఇటుక బట్టీల కోసం బంకమట్టి సేకరణ, వంట చెరుకు కోసం చెట్లను ఇష్టానుసారంగా నరికివేసి బట్టీల్లో వేసి కాలుస్తూ నిబంధనలకు తూట్లు పెడుతున్నారు.దీనికి తోడుగా బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు నిర్వాహకులు ఎలాంటి వసతులు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చిన్నారులు సైతం ఇటుక బట్టీల్లో పనులు చేస్తున్నారు.కార్మిక శాఖ అధికారులు సైతం వారికి అండగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటుక బట్టీల్లో సుమారు లక్ష ఇటుకలను ఒక బట్టీగా పేర్చి ఒకేసారి కాలస్తుంటారు.అది కాస్తా వారం, పది రోజుల పాటు కాలుతుంది. దానికి వరి పొట్టు, వంట చెరుకు అవసరం, వారం, పది రోజుల పాటు బట్టీల్లో మంటలు వస్తుండడంతో ఆ ప్రాంతంలోని భూమి పొరలు వేడుక్కుతాయి.పక్కనే ఉన్న మొక్కలు చనిపోతాయి. భూగర్భజలాలు అడుగంటుతుంటాయి. దీంతో భూ కాలుష్యం పెరిగిపోతుంది.ఇటుకబట్టీల నిర్వహణ వల్ల ప్రధానంగా గాలి కాలుష్యం ఎక్కువగా జరుగుతున్నది. బట్టీలల్లోంచి దుమ్ము, ధూళి, పొగ విపరీతంగా వస్తున్నాయి. వాటి వల్ల ప్రజలకు, వాహనదారులకు అనారోగ్యం బారిపడుతున్నారు. బట్టీలోంచి గాలి ఎంతవరకు వ్యాపిస్తుందో, ఆ ప్రాంతం మొత్తం కాలుష్యంగా మారుతుంది. ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతుంటారు.



# వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మే 8: అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ గేటు పక్కన మిషన్ భగీరథ పైపు పగిలిపోయి గ్రామాలకు సరఫరా చేసే నీరంతా వృథాగా పోతున్నది. ఇప్పటికే మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు స్పందించి నీళ్లు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

చేర్యాల, మే 8: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుల అందె అశోక్ కోరారు. మండలంలోని చుంచనకోటలో సీపీఐ గ్రామ శాఖ 10వ మహాసభ సందర్భంగా చౌరస్తా వద్ద సీపీఐ జెండాను సీనియర్ నాయకులు పొన్నబోయిన విఠలయ్య ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, నరసింహాచారి, సుదర్శన్, నంగి కనకయ్య, నంగి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


# పాఠశాలపై ఎంఈవోకు ఫిర్యాదు

చేర్యాల, మే 8 : చేర్యాల పట్టణంలో శ్రీచైతన్య పాఠశాల పేరుతో శుభోదయ స్కూల్‌లో నిర్వహిస్తుండడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రచ్చ కిష్టయ్యకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలకు అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


సిద్దిపేట, మే 8: రాంప్ ప్రోగ్రాంలో భాగంగా సిద్దిపేట జిల్లా పరిశ్రమల శాఖలో మంజూరైన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఈఎస్ గణేశ్ రామ్ తెలిపారు. రాంప్ అనేది ప్రపంచ బ్యాంకు మద్దతు తో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం అని, కాంట్రాక్టు పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేస్తారని తెలిపారు. ఈనెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని, మిగతా వివరాల కోసం www.nimsme.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా పరిశ్రమల కేంద్రం కార్యాలయం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ గణేశ్‌రామ్ 9441090176లో సంప్రదించాలని పేర్కొన్నారు.

# ఉపాధి కూలీకి పాముకాటు


బాధితున్ని పరామర్శిస్తున్న ఎంపీడీవో

మద్దూరు(ధూళిమిట్ట), మే 8: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీని పాము కాటేసిన సంఘటన గురువారం ధూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్‌తండాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ధరావత్ హనుమంతు ఉపాధి పనులు చేస్తున్న క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. సహచర కూలీలు వెంటనే స్పందించి 108కు కాల్ చేసి అతనిని అంబులెన్స్‌లో చేర్యాల సర్కారు దవాఖానకు తరలించి వైద్యాన్ని అందించారు. హనుమంతుకు ప్రమాదమేమిలేదని వైద్యులు తెలిపారు. ఎంపీడీవో రామ్మోహన్, ఈసీ పరశురాములు బాధితున్ని పరామర్శించారు.

# శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న గణేశ్

గజ్వేల్, మే 8: వేసవిలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంగారి గణేశ్ కోరారు. గురువారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఫుట్‌బాల్ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, నెల రోజుల పాటు కొనసాగే ఈ క్యాంపులో ఉత్సాహవంతులైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుగుణాకర్ రెడ్డి, కోచ్ నర్సింలు, సభ్యులు చక్రపాణి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.